క్రికెట్ అంటే ఇష్టం అన్నవాళ్లకు ఆ ఇంట్లో ఆతిథ్యం ఇట్టే దొరుకుతుంది. ఆటలో మెలకువలు నేర్చుకోవడానికి ఎక్కడలేని ప్రోత్సాహమూ లభిస్తుంది. ఆటగాళ్లకు అన్నీ తానే అయిపోతాడు ఆ ఇంటి యజమాని. క్రికెట్ క్లబ్‌లో చేర్పిస్తాడు. డబ్బుల్లేవంటే కొలువు చూపిస్తాడు. అవసరం ఏదైనా అతనికి చెబితే చాలు.. అది తీరుస్తాడు. ఆయన ఇంట ఆతిథ్యం పొందినవాళ్లు, ఆయన చల్లని చూపులు పడ్డవాళ్లు ఇక వెనుదిరిగి చూసుకోలేదు. సునీల్ గవాస్కర్, కపిల్ దేవ్, అజహరుద్దీన్, సచిన్, వినోద్ కాంబ్లి, గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్, అజయ్ జడేజా... చెబుతూ పోతే మూడు వందలమందికిపైగా అంతర్జాతీయ క్రీడాకారులకు ఆశ్రయమిచ్చి, అన్నం పెట్టి, ఆటలో రాటుదేల్చిన శక్తి ఆయన.

కవర్ స్టోరీ



# అన్ అఫీషియల్ క్రికెట్ సెలెక్టర్




ఇంగ్లండ్‌లోని డ్యూస్‌బరీలో ఉండే ఆ ఇల్లు క్రికెటర్లకు స్వర్గధామం. ఈ ఇంటి యజమాని పేరు సోలీ ఆడమ్. అన్ అఫీషియల్ క్రికెట్ సెలెక్టర్‌గా పేరుపొందిన సోలీ పుట్టుకతో కోటీశ్వరుడు కాదు. పగవాడికి కూడా రాకూడదనుకునే ఎన్నో కష్టాలను అనుభవించాడు. అంచెలంచెలుగా ఎదిగి.. ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్‌లో స్టార్ అనిపించుకున్నాడు. కౌంటీల్లో పాల్గొని, సత్తా చాటాలనుకునే ఎందరో క్రికెటర్లకు నిలువ నీడయ్యాడు. గెలుపు ట్రోఫీ అందించాడు. ఆయన జీవిత చరిత్ర 'సోలీ ఆడమ్.. బియాండ్ బౌండరీస్' పేరుతో పుస్తకంగా వచ్చింది. దానిని చిత్రిక పట్టిన రచయిత వర వంటపాటి మన తెలుగువాడే కావడం విశేషం.

... నాగవర్ధన్ రాయల